భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి: నామా

ఖమ్మం, జూలై 19: భారీ వర్షాలు-వరదల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. లోతట్టు ప్రాంతాలు, శిథిల ఇళ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకుగానీ, పునరావాస కేంద్రాలకుగానీ తరలించాలని అధికారులను కోరారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

28న రాయల చంద్రశేఖర్ సంతాప సభ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ నేత పోటు రంగారావు

ఖమ్మం కమాన్‌బజార్ జూలై 19: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ సంతాప సభను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఈ విషయం చెప్పారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ పాల్గొంటారని చెప్పారు. రేషన్ కార్డులు, ఫించన్లు, రుణాలు తదితర సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 1 నుంచి ఆందోళనలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 8న కలెక్టరేట్ల మందు ధర్నాలు, 21న 'చలో హైదరాబాద్' నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రం అచ్చయ్య, అవుల వెంకటేశ్వర్లు, అవుల ఆశోక్, టి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రశేఖర్ ఆశయ సాధనకు కృషిచేయాలి'

చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

తిరుమలాయపాలెం, జూలై 19: రాయల చంద్రశేఖర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు రేపాకుల శివలింగం కోరారు. మండలంలోని పిండిప్రోలులో శుక్రవారం నిర్వహించిన ఎంఎల్ నేత రాయల చంద్రశేఖర్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. తొలుత చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ నెల 19 నుంచి 25 వరకు రాయల చంద్రశేఖర్ సంతాప దినాలు, 28న ఖమ్మంలో సంతాప సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు కమ్మకొమటి నాగేశ్వరావు, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులుగుజ్జు వెంకటస్వామి, రాయల నాగేశ్వరావు, రావిళ్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి'

అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి

సత్తుపల్లి, జూలై 19: మూడేళ్లు నిండిని చిన్నారులందరినీ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'లో భాగంగా కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మూడేళ్లు నిండిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చినట్లయితే ఆటపాటలు నేర్పించడంతోపాటు మంచి పౌష్టికాహారం అందించనున్నట్లు వివరించారు. టీచర్లు అన్నపూర్ణ, యశోద, పద్మకుమారి, నాగలక్ష్మి, దమయంతి పాల్గొన్నారు.

'పెనుబల్లి సొసైటీలో 376 మందే అర్హులు'

జాబితాను చూసుకుంటున్న యువ రైతులు

పెనుబల్లి, జూలై 19: మండలంలో రూ.లక్ష లోపు రుణమాఫీ కొంత మందికే వచ్చిందని పెనుబల్లి సొసైటీ సీఈవో అర్వపల్లి చెన్నారావు శుక్రవారం తెలిపారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల్లో 376 మంది మాత్రమే అర్హులయ్యాని అన్నారు. పెనుబల్లి సొసైటీ పరిధిలో రూ.లక్ష లోపు రుణాలున్న రైతుల జాబితాలో 2,203 మంది పేర్లతో ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. కానీ వీరిలో 376 మంది రైతులను మాత్రమే ప్రభుత్వం అర్హులుగా గుర్తించి జాబితా తమకు పంపిందని చెప్పారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇస్లావత్‌తండా మాజీ సర్పంచ్ వాచ్చా మృతి

తిరుమలాయపాలెం, జూలై 19: మండలంలోని ఇస్లావత్‌తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ వాచ్చానాయక్ (75) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆయన రెండు దఫాలుగా గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించారు. కాగా, వాచ్చానాయక్ భౌతికకాయాన్ని ఎంపీపీ బోడ మంగీలాల్, పలువురు ప్రజాప్రతినిదులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మధిర: మండలంలో వైరా నది ఉధృతిని పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు; మధిర రూరల్: మధిర మండలంలోని కట్టలేరు వద్ద వరదను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రవాహ తీవ్రతను అంచనా వేయాలి

- మున్నేరు ముంపు ప్రాంతాల పరిశీలనలో కేఎంసీ కమిషనర్
- మండలాల్లో వాగుల ప్రవాహాలను పరిశీలించిన పోలీసులు

ఖమ్మం/ మామిళ్లగూడెం/ సత్తుపల్లి టౌన్/ మధిర/ మధిర రూరల్, జూలై 19: భారీ వర్షాలు-వరదల నేపథ్యంలో ఖమ్మం మున్నేరు పరీవాహక ముంపు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ అభిషేక అగస్త్య శుక్రవారం పరిశీలించారు. మున్నేటికి వరదలు వచ్చినప్పుడు ఏయే ప్రాంతాలు మునుగుతాయని అధికారుల నుంచి తెలుసుకున్నారు. మున్నేటి ప్రవాహ తీవ్రతను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు వస్తున్నట్లయితే పునరావాస కేంద్రాలుగా ఉపయోగించేందుకు వసతి గృహాలను పరిశీలించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటిని శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా, దోమలు వ్యాపించకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మెప్మా టీఎంసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే పోలీసులకు ఫోన్ చేయండి: సీపీ

భారీ వర్షాలు-వరదల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కోరారు. అత్యవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావద్దని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయాల్లో సహాయానికి పోలీస్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని, 87126 59111 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రమాదకరమైన చెరువులు, కుంటలు, వంతెనలు, చప్టాల వద్ద బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

జీఏ వైర్లను తాకవద్దు: ఏసీపీ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కల్లూరు డివిజన్‌లో కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ రఘు సూచించారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలను, గోడలను తాక వద్దని సూచించారు. జీఏ వైర్లపై బట్టలు ఆరవేయవద్దని, శిథిలావస్థలో ఉన్న మట్టిగోడల వద్ద ఉండవద్దని సూచించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కుగానీ, స్థానిక పోలీస్‌స్టేషన్‌కుగానీ ఫోన్ చేయాలని సూచించారు.

ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లో కురుస్తున్న వర్షం

చేపల వేటకు వెళ్లొద్దు: సీఐ

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర సీఐ మధు సూచించారు. మధిర శివాలయం వద్ద పొంగి ప్రవహిస్తున్న వైరానదిని మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లాతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వర్షాలకు వాగులు, నదులు పొంగి ప్రవహిస్తున్నందున ప్రజలు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. వాగులు, నదులు పొంగితే వెంటనే స్థానిక పోలీసులు గానీ, 100 గానీ సమాచారం అందించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లా మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన గృహాల్లో ప్రజలెవరూ ఉండవద్దని సూచించారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ కోన ధనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కట్టలేరు ప్రవాహం పరిశీలన..

భారీ వర్షాల నేపథ్యంలో మధిర మండలంలోని చిలుకూరు గ్రామం వద్ద కట్టలేరు నది ప్రవాహ పరిస్థితిని మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి శుక్రవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రామంలోని రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'కుక్కల బెడద నివారణకు కంట్రోల్ రూం ఏర్పాటు'

సత్తుపల్లిటౌన్, జూలై 19: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1 నుంచి 23వ వార్డుల్లో వీధి కుక్కల బెడద నివారణ కోసం ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు శుక్రవారం తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కుక్కల బెడద ఉన్నట్లయితే 8185869162 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఎరువుల దుకాణాల డీలర్ల ఎన్నిక

కూసుమంచి, జూలై 19: కూసుమంచి మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణదారుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పాలేరులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంటూరి నారాయణ, కార్యదర్శిగా ముల్కూరి శ్యాంసుందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీకి ఎండీ రంజాన్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బిక్కసాని హరీశ్, ఇందుర్తి వెంకటరెడ్డి, తిరుపతిరావు, వల్లభనేని ప్రసాద్, జడల శ్రీనివాస్, బండ్ల సోమిరెడ్డి, పిట్టల కన్నయ్య, తాల్లూరి రాజశేఖర్, నెల్లూరి జగన్ పాల్గొన్నారు.

వైభవంగా శాకాంబరి ఉత్సవాలు

శాకాంబరి అమ్మవారు

మధిర రూరల్, జూలై 19: మండలంలోని మాటూరుపేట గ్రామంలో ఉన్న అంకమ్మ అమ్మవారి దేవాలయంలో ఆలయ బాధ్యులు శుక్రవారం శాకాంబరి ఉత్సవాలను నిర్వహించారు. కూరగాయలతో అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

కారేపల్లి, జూలై 19: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మండల కేంద్రంలో రోడ్డుపై శుక్రవారం హల్‌చల్ చేశాడు. సినిమాహాల్ సెంటర్‌లో మధ్యాహ్నం రోడ్డుపై వచ్చిపోయే వాహనాలకు అడ్డుగా నిలబడ్డాడు. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని భాగ్యనగర్‌తండాకు చెందిన అతడు.. కొన్ని రోజులుగా మండల కేంద్రంలో ఇలా మతిస్థిమితం లేకుండా వ్యవహరిస్తున్నాడు.

రహదారిపై పడుకున్న మతిస్థిమితం లేని వ్యక్తి

పేదింటి ఆడబిడ్డకు 'కల్యాణలక్ష్మి' వరం

చెక్కుల పంపిణీలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల, జూలై 19: పేదింటి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మండల కేంద్రంలోని శ్రీరామ కల్యాణ మండపంలో శుక్రవారం ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నారాయణరావు, సూరంపల్లి రామారావు, ఎంపీపీ కోసు మధు, కోసూరి శ్రీను, చెరుకుమల్లి రవి, మహేష్, గుండ్ల కోటి, పొట్లపల్లి శ్రీనివాసరావు, రేణుక, పరికపల్లి శ్రీను, చిరంజీవి, బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల అధికారులు పాల్గొన్నారు.

ఏపీపీ నాగలక్ష్మికి న్యాయవాదుల వీడ్కోలు



ఏపీపీని సత్కరిస్తున్న మధిర బార్ అసోసియేషన్ బాధ్యులు

మధిర, జూలై 19: తొమ్మిదేళ్లుగా మధిర కోర్టులో ఏపీపీగా పనిచేసి బదిలీపై కొత్తగూడెం కోర్టుకు వెళ్తున్న నాగలక్ష్మికి బార్ అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మధిర కోర్టు ప్రధాన న్యాయమూర్తి టీ.కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇంతమంది న్యాయవాదుల మనసులను చూరగొనడం ఎంతో గొప్ప అదృష్టమని వ్యాఖ్యానించారు. సన్మాన గ్రహీత నాగలక్ష్మి మాట్లాడుతూ.. న్యాయమూర్తులు, న్యాయవాదుల సహకారం వల్లనే ఈ బాధ్యతల్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగానని అన్నారు. ఏపీపీ జున్ను భద్రయ్య, బార్‌అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు బోజడ్ల పుల్లారావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, సుంకు మోహన్‌రావు, నంబూరి జనార్దన్‌రావు, చింతల గోపాల్, దేవరపల్లి సుబ్రమణ్య, కట్టా పూర్ణచంద్రరావు, కావూరి రమేశ్, చావలి రామరాజు, పల్లపోతుల కృష్ణారావు, భైవరబట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలి'

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోడ మంగీలాల్

తిరుమలాయపాలెం, జూలై 19: భారీ వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బోడ మంగీలాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం రైతుల పంట రుణాలు మాఫీ చేసిన దృష్ట్యా వ్యవసాయాధికారులు రైతులకు తగిన సమాచారం ఇవ్వాలని కోరారు. వైస్ ఎంపీపీ బుద్ధ వంశీకృష్ణ, ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవునండీ.. ఇది రైల్వేస్టేషన్ దారేనండీ..

మధిర రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటేనే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2వ నెంబర్ ప్లాట్‌ఫారం వైపు గల రహదారి బురదమయంగా ఉంది. వర్షపునీరు నిలిచి అధ్వానంగా తయారైంది. ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగిచేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే నీరంతా రోడ్డుపైనే నిలుస్తోంది. ఇప్పటికే పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గమనించకుండా వెళ్లే ద్విచక్రవాహనదారులు గోతుల్లో కుదుపులతో కింద పడుతున్నారు. ఇక నడిచి వెళ్లే ప్రయాణికులైతే నరకయాతన పడుతున్నారు. -మధిర, జూలై 19

సార్వజనీన ఆసుపత్రి ఆర్ఎంవోగా కళావతి

ఖమ్మం సిటీ, జూలై 19: జిల్లా సార్వజనీన ఆసుపత్రి ఆర్ఎంవోగా మహబూబాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి రానున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఆమె విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ జవాన్ మృతి

బాలాజీ (ఫైల్)

కారేపల్లి, జూలై 19: చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్ మృతిచెందిన ఘటన మండలంలో కారేపల్లి శుక్రవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని భాగ్యనగర్‌తండాకు చెందిన తేజావత్ బాలాజీ (39) పదేండ్ల క్రితం ఆర్మీలో చేరాడు. కొద్దిరోజుల క్రితం సెలవుపై సొంత గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ఇల్లెందు, ఖమ్మంలోని ఆసుపత్రులకు తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. బాలాజీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు 'పాగి పాటకు పాతికేళ్లు'

ఖమ్మం, జూలై 19: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం 'పాగి పాటకు పాతికేళ్లు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాకారుడు పాగి వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాకవి జయరాజు, అరుణోదయ నాగన్న, సినీ రచయిత యశ్‌పాల్, కవి గద్దె రామనర్సయ్య తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. డప్పులు, కోలాటాలు, బంజార నృత్యాలు, జమిడికలు తదితర కళారూపాలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4.00 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. నగర ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

'వంద బెడ్ల ఆసుపత్రిని కొనసాగించాలి'

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, జూలై 19: తిరుమలాయపాలెంలో వంద బెడ్ల ప్రభుత్వ ఆసుపత్రిని కొనసాగించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తిరుమలాయపాలెం పీహెచ్‌సీని వంద బెడ్ల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఆసుపత్రిని కూసుమంచికి మార్చే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు కొమ్ము శ్రీను, నాగేశ్వరావు, దుర్గాప్రసాద్, కొలిచలం స్వామి, రాములు, వెంకన్న, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ

డైరీలను చూపిస్తున్న విద్యార్థులు

మధిర రూరల్, జూలై 19: మధిర మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాలకు నూతనంగా పదోన్నతి పైవచ్చిన ఉపాధ్యాయులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ఇబ్రహీం, లావుడ్యా రవికుమార్, బాణోతు రాందాస్‌లు విద్యార్థులకు డైరీలు సమకూర్చారు. రూ.10వేల విలువైన ఈ డైరీలను ఎంఈవో ప్రభాకర్ శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం సాయికృష్ణామాచార్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యే బలమైన ఆయుధం: ఎంఈవో

దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మధిర రూరల్, జూలై 19: విద్యార్థుల భవిష్యత్‌ను మార్చే బలమైన ఆయుధం విద్యేనని ఎంఈవో ప్రభాకర్ పేర్కొన్నారు. అందుకని విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకొని జీవితంలో రాణించాలని సూచించారు. మండలంలోని రాయపట్నం ఎంపీయూపీఎస్‌లో గంటా సరోజిని జ్ఞాపకార్థం వారి కుమార్తె గంటా రజిని, అల్లుడు రామానంద్ సమకూర్చిన రూ.50 వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను ఎంఈవో శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతలను సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్ఎం అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ముదిరాజ్ సంఘం నేతల వినతి

నినాదాలు చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కొణిజర్ల, జూలై 19: ముదిరాజ్‌లను 'బీసీ-డీ' నుంచి 'బీసీ-ఏ' లోకిగా మర్చాలని ముదిరాజ్ సంఘం మండల బాధ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సంఘం బాధ్యులు రావూరి హనుమంతరావు, గాదే రాంబాబు, నార్ల మల్సూర్, గొల్కొండ అంజయ్య, నార్ల శేషయ్య, యశోద, కోటయ్య, ఏరుకుల రమేశ్, దొండ దుర్గయ్య పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో డిప్లామా ఓరియంటేషన్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 19: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శుక్రవారం డిప్లామా విద్యార్థులకు ఓరియంటేషన్‌ను చైర్మన్ గుండాల కృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. డిప్లామాలో చేరిన విద్యార్థులకు కోర్సుపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కరస్పాండెంట్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ